సాక్షి కామారెడ్డి
శనివారం । 14 । జనవరి । 2023



వృద్ధులకు చేయూత

వృద్ధ మహిళలకు చేయూత అందించేందుకు వారిని చైతన్యపర్చి అధికారులు ప్రత్యేక సంఘాలు ఏర్పాటు చేయిస్తున్నారు.

- 8లో ▸



గెలుపోటములు సహజం

క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. తాడ్వాయిలో ఆయన మాట్లాడారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
32.0 /16.6

పొగమంచు కురుస్తుంది. చలితీవ్రత కొనసాగుతుంది. చలిగాలులు వీస్తాయి. రాత్రి ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

క్రీడావస్తువులను అందజేసిన స్పీకర్



బాన్సువాడ టౌన్: బాన్సువాడ మినీ స్టేడియంలో శిక్షణ కోసం క్రీడా వస్తువులను శుక్రవారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి స్టేడియం ఇన్‌చార్జి నరేశ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడు తూ విద్యతో పాటు క్రీడలు చాలా ముఖ్యమని, విద్యార్థులు, యువకులు స్టేడియాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువకుల కోసం స్టేడియంలో ప్రత్యేక శిక్షణ తరగతులను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులు ప్రతిరోజూ క్రీడలపై శిక్షణ తీసుకోవాలని సూచించారు. క్రీడా వస్తువుల్లో ఆర్చరీ, డిస్కస్ త్రో, బాస్కెట్ బాల్ తదితర వస్తువులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజేశ్వర్, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, సహకార సంఘం అధ్యక్షుడు కృష్ణరెడ్డి, కౌన్సిలర్లు లింగం, రమేశ్, నార్ల ఉదయ్ పాల్గొన్నారు.

జిల్లాకు 163 జీపీ భవనాలు మంజూరు

కామారెడ్డి క్రైం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2022–23 మండల ప్రణాళికలో భాగంగా జిల్లాలో 163 జీపీలకు నూతన భవనాలను నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను కలెక్టర్ జితేష్ వి పాటిల్ శుక్రవారం జారీ చేశారు. బాన్సువాడ మండలానికి 6, భిక్కనూరు 4, బీబీపేట 1, బిచ్కుంద 12, బీర్కూర్ 4, దోమకొండ 2, గాంధారి 13, జుక్కల్ 5, కామారెడ్డి 6, లింగంపేట 15, మాచారెడ్డి 11, మద్నూర్ 7, నాగిరెడ్డిపేట 6, నస్రుల్లాబాద్ 5, నిజాంసాగర్ 12, పెద్ద కొడప్గల్ 12, పిట్లం 14, రాజంపేట 5, రామారెడ్డి 7, సదాశివనగర్ 5, తాడ్వాయి 1, ఎల్లారెడ్డి మండలానికి 10 చొప్పున మొత్తం జిల్లాలో 163 గ్రామ పంచాయతీలకు నూతన భవనాలు మంజూరైనట్లు కలెక్టర్ వెల్లడించారు. వాటి నిర్మాణాలు త్వరలోనే ప్రారంభించడం జరుగుతుందన్నారు.

జిల్లాకు చేరుకున్న కంటి వెలుగు సామగ్రి



కామారెడ్డి టౌన్: కంటి వెలుగు కార్యక్రమం ఈనెల 18న ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇందుకు సంబంధించిన సామాగ్రి జిల్లాకు చేరుకున్నారు. శుక్రవారం కంటి అద్దాలతో పాటు ఇతర సామాగ్రి జిల్లాకు చేరుకున్నాయి. ఇప్పటికే కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొనే కంటి వైద్య సహాయకులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు, క్యాంపు వైద్యులకు శిక్షణ పూర్తి చేశారు. జిల్లాలో 44 బృందాలు, 606 కంటి వెలుగు శిబిరాలు ఏర్పాటు చేశారు. పట్టణ, గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మణ్‌సింగ్ కోరారు.

జిల్లాలో తహసీల్దార్ల బదిలీ

కామారెడ్డి అర్బన్: జిల్లాలోని పలువురు తహసీల్దార్లు, సూపరింటెండెంట్లను బదిలీలు చేస్తూ కలెక్టర్ జితేష్ వి పాటిల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కామారెడ్డి ఆర్డీవో కార్యాలయ ఏడీవో ఆనంద్‌ను రామారెడ్డి తహసీల్దార్‌గా బదిలీ చేశారు. అక్కడి తహసీల్దార్ ఎ.సురేఖ, తాడ్వాయి తహసీల్దార్ జి.సునీతను కలెక్టరేట్‌కు బదిలీ చేశారు. కామారెడ్డి తహసీల్దార్ బి.ప్రేంకుమార్‌ను భిక్కనూరుకు బదిలీ చేయగా, అక్కడి తహసీల్దార్ సి.నర్సింలును బీబీపేటకు ట్రాన్స్‌ఫర్ చేశారు. సదాశివనగర్ తహసీల్దార్ జపాల వెంకట్‌రావును కామారెడ్డి తహసీల్దార్‌గా బదిలీ చేశారు. సదాశివనగర్ తహసీల్దార్‌గా కె.ధన్‌వాల్‌కు పోస్టింగ్ ఇచ్చారు. దోమకొండ డిప్యూటీ తహసీల్దార్ టి.శాంతను రాజంపేట తహసీల్దార్‌గా బదిలీ చేశారు. రాజంపేట తహసీల్దార్ కె.జానకిని కలెక్టరేట్‌కు డిప్యూటేషన్ వేశారు. దోమకొండ డిప్యూటీ తహసీల్దార్ ఎం.కౌశికకు పూర్తి అదనపు బాధ్యతలతో అక్కడే తహసీల్దార్ పోస్టింగ్ ఇచ్చారు. బీబీపేట తహసీల్దార్ కె.మోతీసింగ్‌ను కలెక్టరేట్‌కు బదిలీ చేశారు. బదిలీ అయిన వారు వెంటనే రిపోర్టు చేయాలని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సంక్రాంతి సంబరం

- ఆధ్యాత్మికం, ఆహారం, ఆరోగ్యం మేలు కలయిక
- అందరినీ ఒక్కచోటకు చేర్చే పండుగ
- సొంతూళ్లకు ప్రజలు
- ముగ్గులు, పతంగులతో చిన్నారుల కేరింతలు
- నోము సామగ్రి కొనుగోళ్లు
- నేడు భోగి పండుగ



సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించే సంక్రాంతి పండుగ రానే వచ్చింది. సంక్రాంతి పండుగను మూడు రోజుల సంబరంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. భోగి, సంక్రాంతి, కనుమ. ఈ మూడు రోజులకు ప్రత్యేకతలున్నాయి. హరిహరాదుల ప్రస్తావన ఆధ్యాత్మికంలో కనిపించినా పండుగలో అన్నం పెట్టే భూమినీ, పంటలకు సహకరించే పశుపక్ష్యాదులను, ప్రకృతిని రైతులు ఆరాధించుకోవడమే పరమార్థంగా కనిపిస్తుంది. సంక్రాంతి అంటే సంక్రమణం, మార్పు.. సూర్యుడు సంచారం చేయడం, సూర్యుడు మకరరాశిలో ప్రవేశించే శుభదినం. ఈ పండుగ జరుపుకునేందుకు వివిధ ప్రాంతాలలో ఉన్న వారంతా తమ సొంత ఊర్లకు చేరుకుంటున్నారు.

– సాక్షి, కామారెడ్డి





పిండి వంటలు చేస్తున్న మహిళలు

పండుగల్లో సంక్రాంతి సంథింగ్ స్పెషల్ అని చెప్పాలి. ఈ వేడుకలో ఆధ్యాత్మికత, ఆహారం, ఆరోగ్యం మేలు కలయికగా ఉంటాయి. అందుకే ప్రతి ఇంటా సంబరాలతో పాటు పిండి వంటలకు ప్రాధాన్యతనిస్తారు. చలికాలం కావడంతో ఆరోగ్య సమస్యలు వెంటాడుతాయి. అందుకే శరీరానికి అవసరమైన ఔషధ గుణాలు మెండుగా లభించే పిండి వంటలు తయారు చేస్తారు. సూర్యుడు ఒక్కో నెలలో ఒక్కో రాశిలోకి ప్రవేశిస్తాడు. అలా ప్రవేశించడాన్ని సంక్రమణం లేదా సంక్రాంతి అంటారు. అయితే సూర్యుడు ధనస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించిన సందర్భంగా దీనిని మకర సంక్రాంతి అంటారు. సంక్రాంతి మూడు రోజుల పండుగ. కొన్ని ప్రాంతాల్లో మాత్రమే మూడు రోజులు జరుపుకుంటారు. మిగతా ప్రాంతాల్లో ఒకటి, రెండు రోజులు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. కొన్ని కుటుంబాల్లో సంక్రాంతి నోములు ప్రత్యేకం. మహిళలు తమ పసుపుకుంకుమలు కలకాలం నిలవాలని ఆకాంక్షిసూ నోముకోవడం సంప్రదాయంగా వస్తోంది. నోముల సందర్భంగా బెల్లం, నువ్వులతో తయారు చేసిన నువ్వుల ముద్దలను బంధువులకు పంపించడం ఆనవాయితీ. బెల్లం, నువ్వులు ఆరోగ్యానికి ఎంతో ఉపకరిస్తాయి. ఆధ్యాత్మికంగా నోముకు, ఇటు ఆరోగ్యపరంగా మంచి ఆహారంగా నువ్వులు ముద్దలు సంక్రాంతి స్పెషల్‌గా చెప్పవచ్చు. కాగా సంక్రాంతి పండుగను ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా చేసుకుంటారు. పండుగకు సెలవులు కూడా ఉండడం మూలంగా చదువుల కోసం వెళ్లిన పిల్లలంతా ఇళ్లకు చేరుకోవడంతో ఇళ్లన్నీ సందడిగా మారతాయి.

సొంతూళ్లకు ప్రజలు

జిల్లాలో ఆంధ్రా రాష్ట్రం వాళ్లు ఎక్కువగా నివసించే బాన్సువాడ ప్రాంతంలో మూడు రోజుల పాటు పండుగను ఘనంగా జరుపుకుంటారు. దేశ, విదేశాల్లో ఉన్న వారు సొంతూళ్లకు వస్తారు. దీంతో పల్లెలన్నీ కళకళలాడుతుంటాయి. కరోనా వల్ల రెండు, మూడేళ్లుగా పండుగ హంగు, ఆర్భాటాలతో చేసుకోలేకపోయారు. చాలా మంది ఊళ్లకు కూడా రాలేదు.

భోగిపండ్లు

భోగిపండ్లుగా పేర్కొనే రేగుపండ్లను పిల్లల తలపై పోస్తారు. సూర్య భగవానుడి అనుగ్రహం పిల్లలపై ప్రసరించి ఆరోగ్యం కలగాలనే సంకేతంగా భోగిపండ్లు పోస్తారు. నేడు భోగి పండుగ నిర్వహించనున్నారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా హరిదాసులు, గంగిరెద్దుల వాళ్లు ఇంటింటికీ తిరుగుతూ ఉంటారు. దీంతో వారికి బియ్యం, ఇతర వస్తువులు ఇచ్చి పంపుతారు.

ఇంటింటా విందు భోజనాలు..

జిల్లాలో సంక్రాంతి పండుగ సందర్భంగ ఇంటింటా విందు భోజనాలు చేసుకుంటారు. పిండి వంటలకు తోడుగా మాంసాహారంతో కూడిన వంటకాలు చేసుకుంటారు. కుటుంబ సభ్యులంతా పండుగ పూట కలిసి భోజనం చేయడం ద్వారా ఆనందాలను పంచుకుంటారు. ఎక్కడెక్కడో ఉన్న వారంతా పండుగకు ఇంటికి చేరతారు. రెండు మూడు రోజుల పాటు అందరూ కలిసి ఆనందంగా గడుపుతారు.



ఇంటింటా పిండి వంటలు..

సంక్రాంతి పండుగ కోసం గతంలో అయితే వారం, పది రోజుల ముందు నుంచే పిండివంటలు తయారు చేసుకునేవారు. ప్రస్తుతం జీవితం బిజీగా మారిన పరిస్థితుల్లో కొందరు రెడీమేడ్ పిండి వంటలు తెచ్చుకుంటున్నారు. ఇంకొందరు పండగకు ఒక రోజు ముందో, అదే రోజు గానీ తయారు చేసుకోవడం కనిపిస్తుంది. ఏ ఇంటికి వెళ్లినా పిండివంటల ఘుమఘుమలు నోరూరిస్తాయి. మన జిల్లాలో అయితే బియ్యం పిండితో సకినాలు, చేగోడీలు, గ్యార అప్పలు, మురుకులు తయారు చేసుకుంటారు. కొన్ని కుటుంబాల్లో బెల్లం, చక్కరతో అరిసెలు తయారు చేస్తారు. పిండివంటలన్నీ ఆరోగ్యానికి ఉపయోగపడేవి కావడం విశేషం.

సంక్రాంతి నోములు ఆనవాయితీ



సంక్రాంతి నోములు ప్రతి యేటా నోచుకోవడం ఆనవాయితీగా వస్తోంది. పుట్టింటివారు, మెట్టినింటివారు సుహాసినులకు నోములు పసుపు కుంకుమలను అందిస్తారు. వాటితో గౌరీ దేవికి పూజలు చేసి నోములను ముత్తయిదువులకు పంచుతాం. అలాగే నేర పండ్లు, జీడి పండ్లను కూడా నోములతో పాటు అందిస్తాం. అలాగే బెల్లంతో తయారు చేసిన నువ్వుల లడ్డూలను కూడా నోములతో పాటు పంచుతాం.

– బొందుగుల పద్మ, భిక్కనూరు

వాకిళ్లలో ముగ్గులు



సంక్రాంతి పండుగ సందర్భంగా ఇంటి ముందు వాకిళ్ల శుభ్రం చేసి కల్లాపి చల్లుతారు. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో పేడతో కల్లాపి చల్లుతున్నారు. ఆ తర్వాత రంగురంగుల ముగ్గులతో వాకిళ్లను నింపేస్తారు. ముగ్గులు వేసిన తరువాత ఆవుపేడతో గొబ్బెమ్మలు చేసి మధ్యలో ఉంచి పసుపు, కుంకుమలు చల్లుతారు. గొబ్బెమ్మను గోదాదేవికి సంకేతంగా భావిస్తారు.

ఇంటిల్లిపాది ఆనందంగా గడుపుతాం



బాన్సువాడ టౌన్: సంక్రాంతి పండుగకు మూడు రోజుల పాటు ఇంటిల్లిపాది సంతోషంగా జరుపుకుంటాం. రైతులు పండించిన పంటలు ఇళ్లకు చేరి సంపదలు అందే రోజులుగా సంక్రాంతిని భావిస్తాం. ఇళ్లలో పిండి వంటలు చేసుకుంటాం. బంధువులందరం ఒక్కదగ్గరికి చేరి పండుగను ఆనందంగా జరుపుకుంటాం. ఆడపిల్లలు, మహిళలు ముంగిళ్లలో బియ్యం పిండితో ముగ్గులు వేసి, రంగులను నింపుతాం. –గిరిజాగాయత్రి, బాన్సువాడ

గాలిపటాలు..



మకర సంక్రమణకు మూడు రోజుల ముందు నుంచే చిన్నపిల్లలు గాలిపటాలను ఎగురవేస్తారు. సూర్యుడి కిరణాలలో ఉండే కిరణాలకు పలు కంటి జబ్బులను తొలగించే గుణం ఉండటం వల్ల ఎంతో మేలు చేస్తాయని వైద్యనిపుణులు చెబుతారు. అంతేగాక రంగురంగుల గాలిపటాలు ఆకాశంలో ఒక దానికొకటి పోటీపడుతూ ఎగురుతాయి. పిల్లలు జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు పోటీతత్వాన్ని ఇది సూచిస్తుంది.

అప్పాలు చేసుకుంటాం



మా కాలనీలో పిండి వంటలను సమష్టిగా చేసుకుంటాం. సంక్రాంతి పండుగ పది రోజులు ముందు నుంచి ఒకరివి చేసిన తరువాత ఇంకొకరి అందరం కలిసి చేస్తాం. ఈసందర్భంగా ఒకరికి ఒకరం అన్న చందంగా సంక్రాంతి పండుగను జరుపుకుంటాం.

– శివరాత్రి విజయలక్ష్మి, కామారెడ్డి

సోలార్ విద్యుత్తుపై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్



మధుమితను అభినందిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: సోలార్ విద్యుత్తు వినియోగంపై స్వయం సహాయక సంఘాల మహిళలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో శుక్రవారం సోలార్ విద్యుత్తు వినియోగంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సోలార్ యూనిట్లను దాబాలపై, ఖాళీ స్థలాలు, రేకుల షెడ్లపై ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. మహిళలు స్త్రీనిధి ద్వారా రుణాలు పొందడం ద్వారా సోలార్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవచ్చని సూచించారు. అంకోల్ క్యాంపులో మహిళలు సోలార్ విద్యుత్తును వినియోగిస్తూ ఆదర్శంగా నిలిచారని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, అంకోల్ సర్పంచ్ రాములు, రెడ్ కో, విద్యుత్తు అధికారులు పాల్గొన్నారు.

ఈ–శ్రమ్ బీమాపై అవగాహన కల్పించాలి

ఈ–శ్రమ్ బీమాపై ఉపాధి హామీ కూలీలు, ఆశ కార్యకర్తలు, గొర్రెల మేకల పెంపకం దారులు, మత్స్యకారులు, వీధి వ్యాపారులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో ఈ–శ్రమ్ బీమాపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డీఆర్‌డీవో సాయన్న, జిల్లా కార్మిక శాఖ అధికారి సురేందర్ పాల్గొన్నారు.

వెల్‌డన్ మధుమిత..

కామారెడ్డి క్రైం: ఇటీవల బెంగళూరులో నిర్వహించిన ప్రపంచ మేధాశక్తి పోటీల్లో జూనియర్స్ విభాగంలో రెండో స్థానం సాధించిన కామారెడ్డికి చెందిన మధుమితను శుక్రవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేలు అభినందించారు.

రోడ్ల అభివృద్ధికి రూ. 25 కోట్లు

- బీటీ రోడ్ల రెన్యూవల్, మరమ్మతులకు కేటాయింపు
- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్



సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి నియోజకవర్గంలో బీటీ రోడ్ల రెన్యూవల్, మరమ్మతుల కోసం రూ. 25.62 కోట్లు మంజూరు చేసినట్లు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ తెలిపారు. శుక్రవారం ఆయన కామారెడ్డిలో 'సాక్షి'తో మాట్లాడారు. బీటీ రెన్యూవల్ కోసం రూ. 15.01 కోట్లు, వర్షాలతో చెడిపోయిన రోడ్ల మరమ్మతుల కోసం రూ. 10.61 కోట్లు మంజూరైనట్లు వివరించారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి మల్లుపల్లి రోడ్డుకు రూ. కోటి 17లక్షలు, జాతీయ రహదారి నుంచి మాసుపల్లి మీదుగా జాతీయ రహదారి వరకు రోడ్డుకు రూ. కోటి 30లక్షలు, అడ్లూర్ క్వారీ – రెడ్డిపేట రోడ్డుకు రూ. 2కోట్ల 30లక్షలు, శాబ్దిపూర్ లెఫ్ట్ తండా – రామేశ్వర్‌పల్లి మీదుగా ఆరెపల్లి రోడ్డుకు రూ. 2కోట్ల 30లక్షలు, ఎల్లంపేట ఆర్‌అండ్‌బీ రోడ్డు – సోమారంపేట రోడ్డుకు రూ. కోటి 30లక్షలు, జెడ్పీ రోడ్డు – సర్దాపూర్ తండా వరకు రోడ్డుకు రూ. కోటి 7లక్షలు, పీడబ్ల్యూ రోడ్డు – రెడ్డిపేట బట్టుతండా వరకు రూ. 75 లక్షలు, మల్కాపూర్ – తుజాల్‌పూర్ రోడ్డుకు రూ. 42లక్షలు మంజూరు చేసినట్లు వివరించారు. కామారెడ్డిలో అశోక్‌నగర్ కాలనీ – ఇల్చిపూర్ రోడ్డుకు రూ. కోటి 17 లక్షలు, లింగాపూర్ – ఖండసారి ఫ్యాక్టరీ రోడ్డుకు రూ.22 లక్షలు, జాతీయ రహదారి – జంగంపల్లి రోడ్డుకు రూ.46 లక్షలు, బస్వాపూర్ – జాతీయ రహదారి వరకు రోడ్డుకు రూ.55 లక్షలు, బస్వాపూర్ చాకలివాడ నుంచి జాతీయ రహదారి వరకు రూ. 20లక్షలు, భిక్కనూరు – సిద్దరామేశ్వర ఆలయం వరకు రోడ్డుకు రూ.19 లక్షలు, జాతీయ రహదారి –ర్యాగట్లపల్లికి రూ. 54 లక్షలు, జాతీయ రహదారి – పెద్ద మల్లారెడ్డి రోడ్డుకు రూ.41 లక్షలు, ఆర్‌అండ్‌బీ రోడ్డు – అయ్యవారిపల్లికి రూ.12 లక్షలు, కంచర్ల – బైపాస్ రోడ్డుకు రూ.12 లక్షలు, పెద్దమల్లారెడ్డి – ఉప్పర్‌పల్లి రోడ్డుకు రూ.14 లక్షలు, బస్వాపూర్ – ర్యాగట్లపల్లి రోడ్డుకు రూ.61 లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డు – బాగిర్తిపల్లికి రూ. కోటి 39లక్షలు, జాతీయ రహదారి – భిక్కనూరుకు రూ.35 లక్షలు, హైవే – రామేశ్వర్‌పల్లి మీదుగా జిల్లా సరిహద్దు వరకు రూ.68లక్షలు నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. జాతీయ రహదారి – లక్ష్మీదేవిపల్లికి రూ.81 లక్షలు, ముత్యంపేట – అంబారీపేట రోడ్డుకు రూ.15 లక్షలు, ముత్యంపేట –భవానీపేట రోడ్డుకు రూ.కోటి 10 లక్షలు, జాతీయ రహదారి – దోమకొండ సబ్‌స్టేషన్ వరకు రోడ్డుకు రూ.కోటి 80 లక్షలు, ముత్యంపేట – చింతామనిపల్లి రోడ్డుకు రూ.42 లక్షలు, దోమకొండ – హరిజనవాడకు రూ. 38 లక్షలు, అంబారీపేట – గోపాల్‌పల్లి రోడ్డుకు రూ.33 లక్షలు, అప్రోచ్‌రోడ్డు – శేరిబీబీపేట రోడ్డుకు రూ. 29 లక్షలు, బీబీపేట హరిజనవాడలో ఇంటర్నల్ రోడ్డుకు రూ.33 లక్షలు, బీబీపేట – మల్కాపూర్ రోడ్డుకు రూ. 90 లక్షలు మంజూరు చేసినట్టు వివరించారు. తుజాల్‌పూర్ – నస్కల్ రోడ్డుకు రూ.33 లక్షలు, రాంచంద్రాపూర్ – జిల్లా సరిహద్దు వరకు రోడ్డుకు రూ.9.70 లక్షలు, తుజాల్‌పూర్ – ఆకారం రోడ్డుకు రూ.34 లక్షలు, ఎల్పుగొండ – బీబీపేట రోడ్డుకు రూ.59 లక్షలు మంజూరు చేసినట్లు వివరించారు.

మాస్టర్‌ప్లాన్ లోపాలను సరిదిద్దుదాం!

- రైతులకు భరోసా ఇవ్వండి
- విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి
- కౌన్సిలర్లతో విప్ గంప గోవర్ధన్

సాక్షి, కామారెడ్డి: మాస్టర్ ప్లాన్ రగడపై ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ టీఆర్‌ఎస్‌కుచెందిన కౌన్సిలర్లతో శుక్రవారం సాయంత్రం పట్టణానికి సమీపంలోని ఓ ఫామ్ హౌజ్‌లో సమావేశమై చర్చించారు. మాస్టర్‌ప్లాన్‌పై మున్సిపల్ చేసిన తీర్మానానికి భిన్నంగా ముసాయిదా తయారైందని, దీనికి డీటీసీపీ అధికారులు, కన్సల్టెన్సీలే కారణమని ఆయన కౌన్సిలర్లకు వివరించినట్టు సమాచారం. ఇండస్ట్రియల్ జోన్, గ్రీన్ జోన్‌లుగా చూపిన పంట పొలాల విషయంలో అభ్యంతరాలను పరిశీలించి సవరించడం జరుగుతుందని వివరించినట్లు తెలిసింది. మాస్టర్‌ప్లాన్‌పై విపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. అంతేగాక రైతులకు భరోసా ఇవ్వాలని, వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. అవసరమైతే రైతులతో సమావేశమై వారికి నచ్చజెప్పి, నష్టం జరగదనే భరోసా ఇద్దామని ఆయన పేర్కొన్నట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రంలో మాస్టర్‌ప్లాన్ అంశంపై గడచిన నలభై రోజులుగా ఆందోళనలు కొనసాగుతుండడం, ఇటీవల తీవ్రం కావడంతో గులాబీ కౌన్సిలర్లపై ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కౌన్సిలర్లందరినీ పిలిచి వారితో మాట్లాడి ఆందోళన చెందవద్దని పేర్కొన్నట్లు సమాచారం.

మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వెంకటేశ్వర్

కామారెడ్డి టౌన్: కామారెడ్డికి మంజూరైన మెడికల్ కళాశాలకు ప్రిన్సిపాల్‌ను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నియమించింది. హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో జనరల్ సర్జన్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ పెరుగు వెంకటేశ్వర్‌ను నియమించింది. సంక్రాంతి పండుగ తర్వాత ఇక్కడకి వచ్చి జాయిన్ అవుతారని వైద్యాధికారులు తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రితో పాటు దేవునిపల్లి వద్ద నూతన నిర్మిస్తున్న ఎంసీహెచ్ భవనాల్లో మెడికల్ కళాశాలను 350 బెడ్స్‌తో త్వరలో ప్రారంభించనున్నారు. పాత కలెక్టరేట్ కార్యాలయంలో టీచింగ్ క్లాసులు నిర్వహించనున్నారు. ఇప్పటికే 423 మంది వైద్యులు, సిబ్బందిని మెడికల్ కళాశాలకు పోస్టులను కేటాయించారు.

రాజీనామా చేయకపోతే కౌన్సిలర్ల ఇళ్లను ముట్టడిస్తాం

- టేక్రియాల్ రైతు జేఏసీ తీర్మానం

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్‌లో వీలీన గ్రామాల కౌన్సిలర్లు రైతు జేఏసీ ఇచ్చిన గడువులోపు రాజీనామాలు చేయకుండా వారి ఇళ్లను ముట్టడిస్తామని టేక్రియాల్ రైతు జేఏసీ తీర్మానించింది. శుక్రవారం టేక్రియాల్‌లో రైతులు సమావేశం నిర్వహించారు. 13వ వార్డు కౌన్సిలర్ శంకర్‌రావుతో మాట్లాడారు. తమకు న్యాయం జరగాలంటే కౌన్సిలర్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలోని రైతులకు న్యాయం జరగడానికి కృషి చేస్తానని కౌన్సిలర్ రైతులకు హామీ ఇచ్చారు. తమకు న్యాయం జరిగే వరకు ఉద్యమం ఆపేది లేదని రైతులు స్పష్టం చేశారు.



టేక్రియాల్‌లో సమావేశమైన రైతులు

క్లుప్తంగా

డిగ్రీ పరీక్షల్లో ముగ్గురి డిబార్



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో శుక్రవారం మాల్‌ప్రాక్టీస్ కు పాల్పడుతూ ముగ్గురు విద్యార్థులు డిబార్ అయినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఎం.అరుణ తెలిపారు. కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల,ఆర్‌కే డిగ్రీ కళాశాల,ఎస్‌ఆర్‌కే డిగ్రీ కళాశాల,మంజీరా డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రాలను కంట్రోలర్ అరుణ తనిఖీ చేశారు. ఉదయం జరిగిన డిగ్రీ రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 4,533 మంది విద్యార్థులకు 4278 మంది హాజరయ్యారు.ఎల్లారెడ్డి ప్రభు త్వ డిగ్రీ కళాశాల కేంద్రంలో ఒకరు, ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయినట్లు ఆమె తెలిపారు. మధ్యాహ్నం జరిగిన డిగ్రీ ఐదో సెమిస్టరు రెగ్యులర్, ఆరో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 8717 మందికి 8066 మంది పరీక్షలు రాశారని కంట్రోలర్ తెలిపారు.

గ్రూప్స్ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

కామారెడ్డి క్రైమ్: జిల్లాలోని షెడ్యూలు కులాల యువతకు గ్రూప్ 1, 2, 3, 4 పోటీ పరీక్షల కోసం ఉచిత శిక్షణ శిబిరాన్ని మూడు నెలల పాటు ఏర్పాటు చేయనున్నట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారిణి రజిత ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల నాన్ రెసిడెన్షియల్ శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. పూర్తి సమాచారం రాబోయే రెండు లేదా మూడు రోజుల్లో ఆన్‌లైన్ ద్వారా గాని, పత్రిక ప్రకటనల ద్వారా గాని తెలియజేస్తామని పేర్కొన్నారు. నిరుద్యోగ ఎస్సీ యువత ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నడస్తున్న ప్రతిభ కళాశాల (సీవోఈ) ల్లో 2023–24 విద్యాసంవత్సరానికి ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ రీజియన్ కోఆర్డినేటర్ మేరీ ఏసుపాదం ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరంలో ఏదైనా ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ లకు చెందిన విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని ఆర్‌సీవో తెలిపారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు www.tswreis.in, www.tsswreisjc. cgg. gov. in వెబ్‌సైట్ ద్వారా రూ.100 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతిభా కళాశాలల్లో ఇంటర్మీడియట్ విద్యతో పాటు ఐఐటీ, జేఈఈ, నీట్, ఎంసెట్, క్లాట్ తదితర పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మార్చి 03న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

రౌడీషీటర్ హత్య కేసులో ఒకరి రిమాండ్

ఖలీల్‌వాడి: రౌడీషీటర్ ఇబ్రహీం ఛావూస్ అలియాస్ జంగిల్ ఇబ్బు హత్య కేసులో నిందితుడు ఉస్మాన్‌ను శుక్రవారం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సాయికుమార్‌గౌడ్ తెలిపారు. ఈ హత్య కేసులో నబీ, రెహమాన్ పరారీలో ఉన్నారు. ఉస్మాన్ బాబా సాహెబ్ పహాడ్‌లోని అటవీ ప్రాంతంలో ఉన్న విషయం తెలుసుకున్న పోలీసులు గురువారం రాత్రి అదుపులోకి తీసుకొని శుక్రవారం కోర్టులో హాజరుపర్చారు.

వృద్ధులకు చేయూత

- 60 ఏళ్లు పైబడిన మహిళలతో ప్రత్యేక సంఘాలు
- సామాజిక పెట్టుబడి నిధి ద్వారా బలోపేతం
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



మైలారంలో వృద్ధులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

బాన్సువాడరూరల్/నస్రుల్లాబాద్: మహిళలను చైతన్య పరచడానికి అధికారులు మహిళా సంఘాలను ఏర్పాటు చేశారు. వారికి రుణాలు అందిస్తు ఆర్థికంగా బల పరిచారు. అయితే 60 ఏళ్ల దాటిన వారికి బ్యాంకు లింకేజీ రుణాలు ఇవ్వక పోవడంతో మహిళా సంఘాల నుంచి తొలగించి కొత్త వారిని చేర్చే వారు. అయితే వృద్ధుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇకనుంచి 60ఏళ్ల పైబడిన వారితో కొత్త సంఘాలు ఏర్పాటు చేసి, సామాజిక పెట్టుబడి నిధిద్వారా బలోపేతం చేయాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా గుర్తింపు సర్వే ప్రక్రియ ప్రారంభం అయ్యింది.

జిల్లాలో 16,918 సంఘాలు..

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలనే ఉద్దేశంతో 1990లో అప్పటి ప్రభుత్వం 10నుంచి 12మంది మహిళలతో స్వయం సహాయక సంఘాలకు రూపకల్పన చేసింది. ప్రస్తుతం కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 16,918 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో 1,74,142 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వీరికి బ్యాంకుల్లో రూ.లక్ష మొదలుకుని రూ.12లక్షల వరకు ఎస్‌హెచ్‌జీ రుణసౌకర్యం కల్పించారు. వైఎస్సార్ హయాంలో పావల వడ్డీ సౌకర్యం కల్పించగా, తెలంగాణ ప్రభుత్వం జీరో వడ్డీ రుణ సౌకర్యం కల్పించింది. ప్రస్తుతం కొన్నేళ్లుగా జీరోవడ్డీ విడుదల నిలిచిపోయింది. రుణాల రికవరీలో ఇబ్బందులు, ఇతరాత్ర కారణాలతో కొన్నేళ్లుగా 60 ఏళ్ల నిండిన డ్వాక్రా మహిళలను సంఘాల నుంచి తొలగించారు. ఇప్పటి వరకు 60ఏళ్ల పైబడిన 12,795 మహిళలను సంఘాల నుంచి తొలగించినట్లు అధికారులు వెల్లడించారు.

కొరవడిన ఆదరణ..

వృద్ధ మహిళలను సంఘాల నుంచి తొలగించడంతో కొందరికి కుటుంబాల నుంచి ఆదరణ, చేయూత కరువైంది. వయోభారానికి తోడు ఆర్థిక అవసరాలకు ఇతరులపై ఆధారపడాల్సి వస్తోంది. దీంతో వీరికి సైతం చేయూతను అందించాలని నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ నిర్ణయించడంతో 60ఏళ్ల పైబడిన వారితో కొత్త సంఘాల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. సెర్ప్ నుంచి డీఆర్‌డీఏ అధికారులకు ఆదేశాలు అందిన నేపథ్యంలో కొత్తసంఘాల ఏర్పాటుకు క్షేత్రస్థాయిలో గుర్తింపు సర్వే ప్రారంభం అయ్యింది. జిల్లాలో 150 వరకు సంఘాల ఏర్పాటుకు అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

బలోపేతానికి చర్యలు

కొత్త సంఘాలతో బ్యాంకుల్లో పొదుపు ఖాతాలు తెరిపించి, సభ్యులు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు సామాజిక పెట్టుబడి నిధి అందజేస్తారు. వీరిలో చదువుకున్న వారికి సీఎల్‌ఆర్పీలుగా అవకాశం కల్పించి స్వయం సంఘాల బలోపేతం కోసం వినియోగిస్తారు. 60ఏళ్ల పైబడిన వారు సంఘాలుగా ఏర్పాటైతే సమస్యలను చర్చించుకోవడానికి వేదిక రావడంతో పాటు సంక్షేమానికి దోహద పడుతుంది. అయితే బ్యాంకు లింకేజీ తదితర రుణాలను వీరికి ఇవ్వబోరని అధికారులు చెబుతున్నారు.

గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది



ప్రభుత్వ ఆదేశానుసారం 60ఏళ్ల పైబడిన వారితో సంఘాల ఏర్పాటుకు క్షేత్రస్థాయిలో గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఐకేపీ సిబ్బంది మహిళల ఇళ్లకు వెళ్లి సంఘం ఏర్పాటు లక్ష్యం, ఉపయోగాలను వివరిస్తున్నారు. త్వరలో కొత్త సంఘాలను ఏర్పాటు చేస్తాం.

– సాయన్న డీఆర్‌డీవో, కామారెడ్డి

అవగాహన కల్పిస్తున్నాం

ప్రతి గ్రామంలో ఉన్న వృద్ధ మహిళల వివరాలను సేకరిస్తున్నాం. వారిని ఒక చోటకి చేర్చి సంఘాలను ఏర్పాటు చేస్తాం. వికలాంగులకు సైతం అవగాహన కల్పించి ప్రత్యేక సంఘంగా ఏర్పాటు చేయనున్నాం. కనీసం ఐదుగురు వికలాంగులు ఉండాలని ఆదేశాలున్నాయి.

– గంగాధర్, ఏపీఎం నస్రుల్లాబాద్

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుందాం



ముగ్గులను పరిశీలిస్తున్న ఎంపీ అర్వింద్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సూర్యనారాయణగుప్తా

సుభాష్‌నగర్: సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి అన్నారు. శుక్రవారం నగరంలోని దుబ్బచౌరస్తాలో మహిళా మోర్చా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ పురస్కరించుకుని మహిళా మోర్చా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. సనాతన ధర్మం, హిందువుల పండుగలను వెలికితీసే విధంగా బీజేపీ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. అనంతరం విజేతలకు ఎంపీ బహుమతులు ప్రదానం చేశారు. అలాగే ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వారికి కిసాన్ ఫ్యాషన్ మాల్ ఆధ్వర్యంలో చీరలను ప్రోత్సాహక బహుమతులుగా అందించారు. ముగ్గుల పోటీలకు సహాయ సహకారాలు అందించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తాకు మహిళా మోర్చా ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గోపిడి స్రవంతిరెడ్డి, పంచరెడ్డి ప్రవళిక, ఇప్పకాయల సుమిత్ర, మోహన్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, జ్యోతి, లక్ష్మీనారాయణ, మాస్టర్ శంకర్, ఎర్రం సుధీర్, భరత్ భూషణ్ పాల్గొన్నారు.



తల్లిని దైవంగా భావించాలని వేసిన ముగ్గు

జిల్లా ప్రజలకు మంత్రి, కలెక్టర్ సంక్రాంతి శుభాకాంక్షలు

సుభాష్‌నగర్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి జిల్లా ప్రజలకు వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలిపారు. భోగభాగ్యాలనిచ్చే భోగి, సరదాలు పంచే సంక్రాంతి వేడుక ప్రజలందరికీ మరింత ఆనందం పంచాలని ఆకాంక్షించారు.

శుభాకాంక్షలు తెలిపిన సీపీ

ఖలీల్‌వాడి: జిల్లా ప్రజలకు సీపీ నాగరాజు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఇంటిల్లిపాది అంగరంగ వైభవంగా పండుగను జరుపుకోవాలన్నారు. ప్రజలందరు వారి కుటుంబ సభ్యులు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

సెలవులో పోలీస్ కమిషనర్

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనర్ నాగరాజు నాలుగు రోజుల పాటు వ్యక్తిగత సెలవులో వెళ్లారు. ఈనెల 12 నుంచి 15 వరకు ఆయన సెలవులో ఉంటారు. ఆయన స్థానంలో కామారెడ్డి ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

యువకుడి ఆత్మహత్య



భిక్కనూరు: మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన ధాత్రిక రామకృష్ణ అలియాస్ రాము (28) తన ఇంట్లోనే గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతుడికి భార్య ఇద్దరూ పిల్లలు ఉన్నారు.

ధనాధన్ టోర్నీకి వేళాయె..

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీకి ఎంట్రీల ఆహ్వానం

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

SPL
SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్‌ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్లు వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన

ఫోన్ నంబర్లు : 9010418884

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

విద్యానగర్ కాలనీలో ముగ్గుల పోటీలు



ముగ్గులు వేస్తున్న మహిళలు

కామారెడ్డిటౌన్: సంక్రాంతి సందర్భంగా కామారెడ్డిలోని విద్యానగర్ కాలనీలో వీఎస్‌సీ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన మహిళలకు పెద్ద ఎత్తున పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గజవాడ రవి, కుంబాల రవి పాల్గొన్నారు.



బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు

పోరాటయోధుల చరిత్రను పుస్తకాల్లో చేర్చాలి



పథ సంచలన్‌లో పాల్గొన్న స్వయం సేవకులు

మోపాల్: దేశం కోసం పోరాడిన వీరుల చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చి భవిష్యత్ తరాలకు అందించాలని వ్యాపారవేత్త నేమాజి నారాయణ అన్నారు. శుక్రవారం నగర శివారులోని బోర్గాం(పి) జెడ్పీహెచ్‌ఎస్‌లో వీర సావర్కర్ శాఖ వార్షికోత్సవం, సంక్రాంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వీధుల్లో పథ సంచలన్ ప్రదర్శించారు. ప్రధాన వక్త గణేశ్ మాట్లాడుతూ సంస్కారవంతమైన సమాజ నిర్మాణం జరగాలని, అది వ్యక్తి నిర్మాణం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంతోపాటు ఎన్నో విపత్కర, అత్యవసర పరిస్థితుల్లో స్వయం సేవకుల పాత్ర కీలకమన్నారు. నగర సంఘ్ సంచాలక్ శ్రీనివాస్, ఉప నగర కార్యవాహ కల్లెడ వెంకటేష్, స్వయం సేవకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

స్నేహితులను కలిసేందుకు వచ్చి..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు



హృషికేష్ మృతదేహం

డిచ్‌పల్లి: వారు ముగ్గురు పదో తరగతి వరకు కలిసి చదువుకున్నారు. ఇప్పుడు వేర్వేరు చోట్ల ఇంజినీరింగ్ చదువుతున్నారు. సంక్రాంతి సెలవుల సందర్భంగా శుక్రవారం ముగ్గురు డిచ్‌పల్లిలో కలిశారు. చాలాసేపు కబుర్లతో ఆనందంగా గడిపారు. అనంతరం బైక్‌పై ముగ్గురు కలిసి బయలుదేరారు. ఇంతలోనే వెనకనుంచి వేగంగా వచ్చిన ఐషర్ (మినీ ట్రక్) వీరి బైక్‌ను ఢీకొట్టి కొంతదూరం వరకు లాక్కెళ్లింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా వారిలో ఒక ఓ యువకుడు మృతి చెందాడు. బాధిత కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖిల్లా డిచ్‌పల్లి గ్రామానికి చెందిన నల్ల అఖిలేష్, ఘన్‌పూర్ గ్రామానికి చెందిన ధీరజ్, ఆర్మూర్ మామిడిపల్లికి చెందిన హృషికేష్‌గౌడ్ (21) స్నేహితులు. హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్న అఖిలేష్ గురువారమే సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చాడు. శుక్రవారం ముగ్గురు స్నేహితులు డిచ్‌పల్లి స్టేషన్‌లో కలుసుకున్నారు. సాయంత్రం వరకు కబుర్లతో ఆనందంగా గడిపారు. అనంతరం సుమారు 5.30 గంటలకు హృషికేష్‌ను ఆర్మూర్‌లో దింపి వచ్చేందుకు అఖిలేష్, ధీరజ్ ఒకే బైక్‌పై బయలుదేరారు. 44వ నంబరు జాతీయ రహదారిపై సుద్దపల్లి శివారులో వెనక నుంచి అతి వేగంగా వచ్చిన ఐషర్ వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే ఐషర్ వాహనం డ్రైవర్ అక్కడి నుంచి వాహనంతో సహా పరారయ్యాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి చేరేసరికి గాయపడ్డ వారిలో హృషికేష్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన అఖిలేష్, ధీరజ్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం వారి కుటుంబీకులు జిల్లా కేంద్రంలోనే ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని డిచ్‌పల్లి పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు నిర్మల్ టోల్‌ప్లాజా వద్ద అక్కడి పోలీసులు పట్టుకున్నారు.

చెరువులో పడి మహిళ మృతి



సాయవ్వ(ఫైల్)

బాల్కొండ: ముప్కాల్‌కు చెందిన బద్దం సాయవ్వ (52) చెరువులో పడి మృతి చెందింది. ఎస్సై ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సాయవ్వ కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతోంది. ఈ క్రమంలో తరుచు చనిపోతానంటు ఇంట్లో నుంచి వెళ్లిపోయేది. అలానే శుక్రవారం ఉదయం కూడా ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. కుటుంబ సభ్యులు ఉదయాన్నే కనిపించడం లేదని ఫిర్యాదు కూడ చేశారు. శుక్రవారం సాయంత్రం ఊర చెరువులో ఆమె మృతదేహం తేలింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య

బిచ్కుంద: కుటుంబ కలహాలతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. కాలనీకి చెందిన హన్మండ్లు అలియాస్ చిన్నా(32) పెయింటర్‌గా పని చేస్తాడు. ఆయన భార్య జ్యోతి జుక్కల్‌లోని కార్మెల్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తుంది. రెండు రోజుల క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో జ్యోతి ఇంట్లో ఉన్న వస్తువులు అన్ని తీసుకొని పిల్లలతో కలిసి తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన హన్మండ్లు గోడపై సూసైడ్ నోట్ రాసి ఇంట్లో ఉరి వేసుకున్నాడు. తన మృతికి భార్య జ్యోతి, అత్త, మామ, బావమరిది, కార్మెల్ స్కూల్ టీచర్ శ్రావణ్ కారణమని, దయచేసి మా అమ్మకు న్యాయం చేయండి అని గోడపై సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతి కారకులైన అందరిపై కేసు నమోదు చేయాలని బంధువులు డిమాండ్ చేశారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

నాటు వేస్తుండగా మీద పడ్డ బండరాయి

- మహిళకు గాయాలు
- బండలను పేల్చడంతో ఘటన

లింగంపేట: పొలంలో బండరాళ్లు తొలగించడానికి మందుపాతర పేల్చగా ఆ రాయి ఎగిరి పడి పొలం పనులు చేస్తున్న మహిళ గాయపడింది. ఈ ఘటన బుధవారం జరగ్గా ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు.. గోపాల్‌పేటకు చెందిన జక్కుల బాల్‌రాజు పంట చేను మండలంలోని లొంకల్‌పల్లి శివారులో ఉంది. ఆయన తన పొలంలో బండరాళ్లు తొలగించడానికి బుధవారం మందుపాతర(బర్మా) పెట్టి పేల్చాడు. అదే సమయంలో సమీపంలో ఉన్న మరొకరి పంట చేనులో వదల్‌పర్తికి చెందిన చిట్యాల సాయవ్వ నాటు వేస్తుండగా మందు పాతర పెట్టి పేల్చిన బండరాయి ఎగిరి వచ్చి ఆమె చేతిపై పడింది. దాంతో చేయి విరిగి తీవ్ర గాయాలు అయ్యాయి. ఆమెను వెంటనే ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మందుపాతర పెట్టిన ఒడ్డె రాజును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై శంకర్ తెలిపారు.

సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న ఇద్దరి అరెస్ట్

ఖలీల్‌వాడి: నగరంలోని రైల్వేస్టేషన్ సమీపంలో సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని రైల్వే పోలీసులు పట్టుకొని ఒకటో టౌన్ పోలీసులకు అప్పగించారు. నగరంలోని బాబాసాహెబ్ పహాడ్‌కు చెందిన షేక్‌జావీద్, షేక్ అబ్బును పట్టుకొని వారి నుంచి వీవో వీ16, రెడ్‌మీ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

కుక్కల దాడిలో ఆరుగురికి గాయాలు

నస్రుల్లాబాద్: బీర్కూర్ ఇందిర కాలనీలో పిచ్చి కుక్కలు స్వైర విహారం చేశాయి. ఆరుగురిపై దాడి చేసి గాయపరిచాయి. బాధితులను కుటుంబ సభ్యులు స్థానిక పీహెచ్‌సీలో చేర్పించారు. గ్రామంలో కుక్కల బెడద తగ్గించాలని స్థానికులు కోరుతున్నారు.

దోమల నివారణ కోసం పొగ..

- మంటలు వ్యాపించి పశువుల కొట్టం దగ్ధం
- రెండు గేదెలకు గాయాలు

మాక్లూర్: దోమల కోసం పశువుల కొట్టంలో పెట్టిన పొగ ద్వారా మంటలు వ్యాపించి గుడిసె కాలిపోయింది. ఈ ఘటనలో కొట్టంలోని రెండు గేదెలు తీవ్రంగా గాయపడ్డాయి. వివరాలు.. మండలంలోని గుత్ప గ్రామానికి చెందిన సూరి చిన్న దేవన్న గురువారం రాత్రి తన గేదెలను కొట్టంలో కట్టేశాడు. అనంతరం మేతవేసి, వాటికి దోమలు కుట్టకుండా కొట్టంలో నిప్పుతో పొగపెట్టి నిద్రపోయాడు. అర్ధరాత్రి సమయంలో గేదెల అరుపులు విని లేచేసరికి కొట్టంలో మంటలు వ్యాపించాయి. రెండు గేదెలు కాలిన గాయాలతో పడి ఉన్నాయి. శుక్రవారం పశు వైద్యాధికారి కిరణ్‌దేశ్ పాండే తన సిబ్బందితో ఘటన స్థలానికి వచ్చి గాయపడ్డ గేదెలకు చికిత్స అందించారు.